క్లుప్తంగా

తాతాజీ సేవలు అభినందనీయం



తాతాజీకి జ్ఞాపికను అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కష్టాల్లో ఉన్న వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్లతాతాజీ సేవలు అభినందనీయమని ఆలిండియా పూలే, అంబేడ్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పొట్ల సురేష్ విజయకుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం తాతాజీకి ఫౌండేషన్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి డబ్బు, సమయం కాదని సేవ చేయాలనే మనసు ఉండాలని అది తాతాజీకి ఉండడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో తాతాజీ మరిన్ని సేవలిందించి మరింత పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



రామన్నపాలెంలో విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ ఆకన వారితోటలో శ్రీహనుమత్, లక్ష్మణ, సీతారామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పద్దాల వెంకమ్మ ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ట్యాబ్ వినియోగంపై అవగాహన



ట్యాబ్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్ కుమార్

మొగల్తూరు: ప్రతి విద్యార్థి ట్యాబ్‌ల వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీఓ ఆర్సీ ఆనంద్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక నెంబర్ 1 పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల వినియోగించే ట్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు వినియోగిస్తున్న విధానాన్ని పరిశీలించి తగు సలహాలు, సూచనలు అందచేశారు. త్వరలో జరుగబోయే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ తదితరులున్నారు.

నెగ్గిపూడి గురుకుల పాఠశాలను తనిఖీ



నెగ్గిపూడిలో గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి

పెనుమంట్ర: మండలంలో నెగ్గిపూడి గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలను ఆగ్రామ ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి బోధన జరుగుతుందో? సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయో? తదితర అంశాలను ఉపాధ్యాయులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ప్రధాన అంశాలతో పాటు వసతి సౌకర్యాలు కూడా మెరుగ్గా ఉన్నాయని విద్యార్థులు తెలియజేయడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

మెడికల్ పీజీలో విద్యార్థి ప్రతిభ



అనూషారెడ్డి

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన డాక్టర్ గుడిమెట్ల అనూషారెడ్డి మెడికల్ పీజీలో ఆల్ ఇండియా స్థాయిలో 500వ ర్యాంకు సాధించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ఆశ్రం కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అనూషారెడ్డి ప్రస్తుతం పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 104లో మెడికల్ ఆఫీసర్‌గా పని చేసి, గ్రామీణ ప్రాంతాలలోని రోగులకు విశేష సేవలందించారు. ఇటీవల జరిగిన పీజీ ఎంట్రెన్స్ పరీక్షల్లో ఆమె ఈ ర్యాంకును సాధించారు.

గడప చెంతకు చేరిన అభివృద్ధి

- గడపగడపకు మన ప్రభుత్వంలో తెలిపిన సమస్యల పరిష్కారం
- ముఖ్యంగా రోడ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి

యలమంచిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన తరువాత గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. పాలకొల్లు నియోజకవర్గంలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో 67 గ్రామాలుండగా ఇప్పటికి 63 గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. ఈ కార్యక్రమం పూర్తయిన ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేయడంతో ఆ నిధులతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ రహదారులకు మహర్దశ పడుతుంది. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో మంజూరు చేసిన ఇందిరమ్మ కాలనీలు ప్రతి గ్రామంలో ఉన్నాయి. మహానేత మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలన్నీ ఆ కాలనీలను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆ కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు కనీస వసతులు లేక అల్లాడుతున్నారు. అటువంటి చోట్ల గడప గడపకూ మన ప్రభుత్వ నిధులు కేటాయించడంతో ఆ కాలనీల్లో సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

జిల్లా పరిషత్ నిధులతో

వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ గడపకూ మన ప్రభుత్వ నిధులకు జిల్లా పరిషత్ నిధులు కూడా జత చేసి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. శ్రీనివాస్ జెడ్పీ చైర్మన్ అయిన వెంటనే నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రూ.20 లక్షలకు తగ్గకుండా రూ.50 లక్షల వరకు జిల్లా పరిషత్ నిధులు కేటాయించారు. దీంతో నియోజకవర్గంలోని 67 గ్రామాలతోపాటు పాలకొల్లు మున్సిపాలిటీలో కూడా రోడ్లు, డ్రయిన్స్ పనులు వేగంగా జరుగుతున్నాయి.



పెనుమర్రులో జిల్లా పరిషత్ నిధులతో వేసిన సిమెంట్ రోడ్డు



అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రులో నిర్మించిన సిమెంట్ డ్రెయిన్

దళితపేటల్లో రోడ్లు బాగుపడ్డాయి..



పెనుమర్రు గ్రామానికి జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ జిల్లా పరిషత్ నిధులు రూ20. లక్షలు మంజూరు చేశారు. మా గ్రామ సర్పంచ్ కవురు గోపి ఆ నిధులన్నీ దళితపేటలో రోడ్ల నిర్మాణానికి కేటాయించారు. దీంతో మా గ్రామంలోని దళిత పేటల రోడ్లన్నీ బాగు పడ్డాయి.

పాకా సూర్యనారాయణ, పెనుమర్రు

ప్రతి గ్రామంలో వేగంగా అభివృద్ధి పనులు..



గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో పాటు జిల్లా పరిషత్ నిధులు కూడా పెద్ద ఎత్తున మంజూరు కావడంతో గ్రామాలలో రోడ్డులు, డ్రయిన్స్ నిర్మాణ పనులు వేగంగా చేయిస్తున్నాం. నిధుల కొరత లేకపోవడంతో గ్రామాలలో చిన్న చిన్న సమస్యలకు పరిష్కారం త్వరితగతిన లభిస్తుంది.

వర్ధనపు శ్యాంబాబు, పంచాయతీరాజ్ ఏఈ

నెలాఖరుకు నూరు శాతం పన్నుల వసూళ్లు

మొగల్తూరు: మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం పన్నులు వసూళ్లు పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆర్సీ ఆనంద్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 17 పంచాయతీలకు గాను కొన్ని పంచాయతీలు పన్నులు వసూళ్లల్లో వెనకుబడ్డాయని త్వరగతిన వసూళ్లు పూర్తి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఎండలు ఎక్కువుగా ఉంటాయని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కాలువలు కట్టేలోపు తాగు నీటి చెరువులు, పశువుల చెరువులు, రజకుల చెరువులు పూర్తి స్థాయిలో నింపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ సచివాలయంలోను ప్రభుత్వ నిర్దేశించిన విధంగా సేవలు అందేలా చూడాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఈస మావేశంలో ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల వద్ద ఈ-క్రాప్ వివరాల ప్రదర్శన

యలమంచిలి: మండలంలో 5760.55 ఎకరాల సాగుభూమికి సంబంధించి 4022 మంది రైతులకు ఈ క్రాప్ నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి సీహెచ్ దేవి తెలిపారు. ఈ నెల 13 నుంచి 17 వరకు ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల వివరాలను ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. రైతులు తమ వివరాలను సరి చూసుకోవాలని కోరారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని అన్నిరైతు భరోసా కేంద్రాలలో 2022-23 సంవత్సరానికి గాను రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ ముసాయిదాను అన్ని కేంద్రాలలో రైతుల సందర్శనార్థం ఉంచినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి ఎంజేడీ మాధురి తెలిపారు. రైతులు ముసాయిదాను పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 17వ తేదీలోపు రాత పూర్వకంగా అభ్యర్థనను అందజేయాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ఈ గ్రామ సభలలో తుది జాబితాను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో వద్ద పేకాట ఆడుతున్న 11 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాళ్ల ఎస్సై మూర్తి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం స్పెషల్ బ్రాంచ్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కాళ్లపోలీసులు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఏలూరుపాడులో పేకాట స్థావరంపై దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ69,800 స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వికలాంగులకు బస్సు, రైల్వే పాసులు పంపిణీ

పెనుగొండ: వికలాంగులకు ఉచిత బస్సు, రైల్వే పాసులు పంపిణీ శిబిరం గురువారం పంచాయతీ వద్ద నిర్వహించనున్నట్లు పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకూ పాసులు జారీ చేస్తామన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం రెండు కాపీలు, ఆధార్ రెండు కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు రెండు, గుండె జబ్బుల రోగులు మెడికల్ సర్టిఫికెట్ కాపీతో రావాలని సూచించారు. బస్సు పాస్‌కు రూ.100, రైల్వే పాస్‌కు రూ.200 రుసుం చెల్లించాలన్నారు. మిగిలిన వివరాలకు ప్రోగ్రాం అధికారి కె.వెంకటాద్రి, 76709 11086కు ఫోన్ చేయాలని కోరారు.

తల్లిపై కూతురి దాడి

సాక్షి, భీమవరం: భీమవరం రెండో పట్టణం సత్యవతి నగర్‌కు చెందిన డి.సుభద్ర అనే మహిళను ఆమె కుమార్తె పార్వతి కొట్టడంతో చేతికి తీవ్ర గాయమైందని ఎస్సై వి.రాంబాబు తెలిపారు. ఇంటి విషయమై ఘర్షణపడి కొట్టినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పాలకొల్లులో పరీక్షా కేంద్రాల వద్ద తమ నంబర్లు పరిశీలించుకుంటున్న విద్యార్థులు



పెనుగొండ ఎస్వీకేపీ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టరు సూర్యతేజ

పాలకొల్లు సెంట్రల్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం పట్టణంలో ఏఎస్ఎన్ఎం జూనియర్ కళాశాల, కోకోనట్ జూనియర్ ఉమెన్స్ కళాశాల, ఛాంబర్స్ జూనియర్, గౌతమి, ఆదిత్య, చైతన్య, సవిత కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను నిర్వహించారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకుని తమ హాల్‌టికెట్ ద్వారా తమ పేర్లను, నంబర్లను పరిశీలించుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేశారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఏఎస్ఎన్ఎం జూనియర్ కళాశాలలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ పరీక్షలను పరిశీలించారు.

పరీక్షల తనిఖీ

పెనుగొండ: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ ఆకస్మిక తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, వైద్య ఆరోగ్య శాఖ శిబిరాన్ని, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఎగ్జామ్ రూంలను స్వయంగా పరిశీలించారు. సమీపంలోని జిరాక్స్ దుకాణాలను మూయించి వేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా 144 సెక్షన్ అమలు కచ్చితంగా ఉండాలన్నారు. పరిశీలనలో తహసీల్దారు ఎన్.గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు. కాగా, పెనుగొండ కేంద్రంలో 607 మంది విద్యార్థులకు 569 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు.

ఆచంటలో

ఆచంట జూనియర్ కళాశాలలో ఇంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 104 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, నలుగురు విద్యార్థులు గైర్హజరయ్యారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: మనిషి ఆపద సమయంలో ఉన్నప్పుడు రక్తదానం చేసి వారిని ఆదుకోవడం వల్ల ఒకరి ప్రాణంతో పాటు ఆ కుటుంబాన్ని కూడా కాపాడినవారవుతారని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఆసుపత్రి, ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ అండ్ టు, రెడ్ రిబ్బన్ క్లబ్, హెల్త్ కేర్ సెంటర్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణీ సమయంలో, డెంగీ జ్వరాల వల్ల ప్లేట్‌సెట్స్ పడిపోవడం వంటి సమయాల్లో రక్తదానం ఏంతో ముఖ్యమని అన్నారు. విద్యార్థులు రక్తదానం చేయడంలో వెనుకడుగు వేయకుండా ఆపద సమయంలో ఆదుకునేలా ఉండాని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సూపరిండెంట్ పి పతాంజలి, డాక్టర్ ఎం స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, గెస్ట్ ప్యాకల్టీ పి జ్యోత్స్న, వై విజయ్‌కుమార్, జి మహేష్, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం....

స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాలలో వినియోగదారుని హక్కుల దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీరవాసరం డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ యస్ వి రంగారావు మాట్లాడుతూ వినియోగదారులు ఏ వస్తువు కొన్నా తప్పనిసరిగా బిల్లు అడగాలని అన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు హక్కులపై పోస్టర్ ప్రదర్శన చేయగా ఈ ప్రదర్శనలో విజేతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, అధ్యాపకులు టి కృష్ణ, వి విజయలక్ష్మి, పి.దుర్గేశ్వరి, డి మన్మధరావు, పూర్వ విద్యార్థి శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు తనిఖీ



వల్లూరు సచివాలయంలో రికార్డులు తనికీ చేస్తున్న జిల్లా అధికారి అప్పారావు

పెనుగొండ: జిల్లా కలెక్టరు ఆదేశాలతో వల్లూరు పంచాయతీ రికార్డులు తనికీ చేయడం జరిగిందని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా జీఎస్ డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి కేసీహెచ్ అప్పారావు తెలిపారు. బుధవారం రికార్డుల తనికీ అనంతరం ఎంపీడీఓ వి.జగన్నాథరావుతో కలిసి వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి గ్రామ సచివాయాలను సందర్శించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ 250 తక్కువ కాకుండా సర్వీస్ రిక్వెస్టులను నమోదు చేయాలని, ఏపీ, మీసేవ పోర్టల్‌లో వచ్చిన అమౌంట్‌ను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ప్రతీ ఉద్యోగి డిపార్టెమెంట్ వారీగా రికార్డులను ఎప్పటికపుడు నవీకరించుకోవాలని, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాలకు సబంధించి గ్రామాల్లో వలంటీర్లు ద్వారా విస్తృతమైన ప్రచారాన్ని కల్పించాలన్నారు. జలుబు, దగ్గు తీవ్రమైన జ్వరాలు ఉన్నందున ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సచివాలయంలో స్పందన ప్రతిరోజూ 3 గంటల నుంచి 5 గంటల వరకూ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు జీవీవీ సత్యనారాయణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు జలాభిషేకం



వాలమర్రులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రులో భక్తుల విరాళంతో పెన్మెత్స సత్య సీతారామరాజు (మునసబు) జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామివార్ల ఆలయ, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలో భాగంగా బుధవారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 12 మంది దంపతులతో బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో రుత్వికుల వేద మంత్రోచ్చరణలతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. హోమగుండంలో రావి, మోదిగ, దేవదారు సమిదలు, ఆవునెయ్యి తదితర హోమద్రవ్యాలతో భక్తులతో పూజలు చేయించారు. అనంతరం దేవతామూర్తులైన శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి, శ్రీలక్ష్మీదేవి విగ్రహాలు, శిఖరాలు జలాదివాసం చేశారు. హోమగుండం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుమంట్ర: గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెనుమంట్ర మండలంలోని నెగ్గిపూడి గ్రామానికి చెందిన మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ వాణి చింతపల్లి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 4లోపు తమ దరఖాస్తులను పంపించాలని కోరారు. విద్యార్థులను రాత పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని ఆమె తెలిపారు. ఈపాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత వసతి, బోధనతో పాటు క్రీడలు, బోధనేతర కార్యక్రమాల్లో కూడా శిక్షణ ఉంటుందని, పూర్తి వివరాల కోసం 87902 96772 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

వీఓఏలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి



పెనుగొండలో ఏపీఎంకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుగొండ: డ్వాక్రా మహిళలకు సేవలు అందిస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి, వారికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పెనుగొండలో వెలుగు శాఖ ఏపీఎంకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘ అధ్యక్షురాలు జి లక్ష్మీ, కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: వెలుగుశాఖలో వీవోఏలుగా పనిచేస్తున్న మహిళలు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య భవనం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నరసాపురం మండలంలో 59 మంది వీఓఏలుగా పనిచేస్తున్నారని అన్నారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు జి.పద్మకుమారి, డి.సూర్యమణి, కె.సత్యవతి పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాల తొలగింపు

సాక్షి కథనానికి స్పందన



రైల్వేస్టేషన్ రోడ్‌లో ప్రైవేట్ వాహనాలు తీయించిన దృశ్యం

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఇష్టానుసారం ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులపై ఈనెల 12న సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వాహనాలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. అలాగే అక్కడ ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్టు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. రైల్వే స్టేషన్ రోడ్‌లో ప్రైవేట్ బస్సులు, రొయ్యల కంపెనీలకు సంబంధించిన ఇతర ప్రైవేట్ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలిపి ఉంచుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బస్సులను కూడా ఈ ప్రాంతంలో కడగడంతో రోడ్డు పక్కన బురదమయంగా ఉంటుంది. ప్రస్తుతం అధికారుల చర్యల వల్ల సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

నరసాపురం రూరల్: రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విదానాలు పాటిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేలయు కోరారు. బుధవారం మండంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులు, కార్మికులతో మాట్లాడారు. ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచి పెడుతూ కార్మికులను, ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కవురు శ్రీనివాస్, పెచ్చెటి శ్రీనివాస్, కవురు ఏసు, యాండ్ర హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.